తొలిసారిగా
ప్రపంచాన్ని
చూసే చూపు
లభించిన ఆమె
ఎవర్నీ చూడకూడదని
ఎందుకనుకుంది?

# ఉప్పులూరి సత్యనారాయణ కథ

# మనో నేత్రం

సంగీత కచేరి నుండి తిరిగొచ్చిన డాక్టర్ సరోజినీ దేవి మనసు మనసులో లేదు. ఆ పూటకు భోజనం చేయనని చెప్పి తన గదిలోకి వెళ్ళి ప్రక్కమీద వాలిపోయింది. ఎయిర్ కండిషన్ గదిలోవున్నా ఆమె మనసు చల్లబడలేదు. ఆ సాయంత్రం సంగీత కచేరిలో తను చూసిన దృశ్యాల మీదే ఆమె మనసు నిలిచి పోయింది.

ఆ అమ్మాయికి పద్దెనిమిదేళ్ళ వయసు వుంటుందేమో! అవును తన లెక్క ప్రకారం అంతే వుండి వుండాలి. గులాబీ రంగుపట్టు చీర కట్టుకుని అదేరంగు మాచింగ్ బ్లౌజ్ వేసుకున్నది. గంధపు బొమ్మవలే పశిమి ఛాయతో మెరిసి పోతున్నది. ఆమె నుదిటిన దిద్దిన తిలకపు బొట్టు చీకట్లను చీల్చిన తొలి ఉషస్సును జ్ఞప్తికి తెస్తున్నది. అందం, ఐశ్వర్యం అన్నీ ఇచ్చిన ఆ భగవంతుడు ఆ ఒక్క లోపం కలిగించకుండా వుంటే ఎంత బాగుండేది.

ఆ అమ్మాయిని ఎవరో స్టేజిమీదికి నడిపించుకు వచ్చి సభకు పరిచయం చేసినప్పుడుగాని ఆమెలోని లోపాల్ని ఎవరూ గమనించలేదు. ఆమె అంధురాలని తెలియగానే సభికులంతా ఆశ్చర్యంలో మునిగి పోయారు. రేడియోలో ఆమె కంఠస్వరాన్ని విన్నప్పుడు ఇంత చక్కగా పాడుతున్న ఆ అమ్మాయి ఎవరా ఉత్కంఠతో ఊపిరి బిగపట్టుకున్నారు. ఆమె సంగీత మాధురి కర్నాటక సంగీత జగత్తులో ఒక ఊపుఊపి విప్లవాన్ని సృష్టించింది. ఒక కొత్త వరవడిని ప్రవేశ పెట్టింది. శాస్త్రీయ సంగీతం అంటే ఇలా వుండాలి అని కొత్త ప్రయోగం చేసి



చూపింది. ఆమెకున్న అంధత్వ లోపాన్ని జయించి కీర్తి శిఖరాలను అధిరోహించింది.

ఆమె గళం విప్పి పాడుతున్నంతసేపు ఆడిటోరియంలో శ్రోతలు నిశ్శబ్దానికి అంకితమై తమను తాము మైమరచిపోయారు. ఆమె పేరు సరస్వతి. అవాధ అంధురాలైన ఆ బాలికను ఒక సంగీత విద్వాంసుడు పెంచి పెద్ద చేసి తన

ఆస్తితోబాటు తన సంగీత ప్రవంతికి ఆమెను వారసురాలుగా చేసి ఈ లోకాన్ని వదిలి వెళ్ళి పోయాడు.

ఆమె చరిత్ర వినగానే డాక్టర్ సరోజినీ దేవి హృదయయం బాధతో విలవిలలాడింది. అప్రయత్నంగా కన్నీరు కురిసింది. ఆమె మనసు గతస్మృతులలోకి వెళ్ళిపోయింది.

* * *

'ఆడపిల్ల పుట్టింది. [illegible]పేసేం గంధపు బొమ్మవలే పు[illegible]స్తావా?'' అన్నాడు సరోజినీదేవి తం[illegible] రాఘవరావు. అంతవరకు ప్రసవవేదనను అనుభవించి నిస్త్రాణంగా వున్న సరోజినీ దేవి ఆత్రంగా "ఒక్కసారి చూపించుడాడీ!" అంది. ఆయన ఎందుకో కొన్ని క్షణాలు సందేహించాడు. కానీ తప్పదన్నట్టుగా ఉయ్యాలలోని బిడ్డను తీసి ఆమె చేతికి అందించాడు.

బిడ్డను ఆనందంగా వడిలోకితీసుకుని ఒక్కసారి పరిశీలనగా చూసి షాక్ తిన్నట్టు 'కెవ్వు'మని అరచి పురిటి కందును చేతుల్లోంచి క్రిందికి వదిలేసింది. రాఘవ రావు ఆ బిడ్డను క్రిందపడకుండా పట్టు కున్నాడు.

'ఆ బిడ్డ అంధురాలు డాడీ?'' అని హిస్టీరిక్‌గా అరిచింది.

'అంధురాలైతే నేమి, సంపంగి మొగ్గలా వుంది'' అన్నాడు.

"వద్దు నాన్నా వద్దు. దాని ముఖం నాకు చూపించకు, ఒక అంధురాలి తల్లిగా ఈ సమాజపు సానుభూతిని నేను భరించలేను. అహం చంపుకుని బ్రతకలేను. నా ఆశల్ని, అందమైన కలల్ని భగ్నం చేసింది దీన్ని ఎదురు పెట్టుకుని నేను బ్రతకలేను... తీసుకెళ్ళు... వెంటనే తీసికెళ్ళిపో..."

సరోజినీ స్పృహ తప్పిపోయింది. హిస్టీరియా పేషెంట్‌వలే ఆమె కాళ్ళూ చేతులూ కొట్టుకోవడం ప్రారంభించాయి. రాఘవరావు డాక్టర్ గదికేసి పరుగెత్తాడు.

* * *

తెల తెలవారుతూ వుండగా సముద్రపుటొడ్డున సంగీత సాధన ముగించుకుని తిరిగి వస్తున్న విశ్వనాథ భాగవతార్ పసిబిడ్డ ఏడుపు విని ఆగిపోయాడు. ఆ పురిటి కందు ఏడుపు అతని కర్ణ రంధ్రాలకు ఏడుపువలెకాక మృధుమధుర మురళీ రవంవలే తోచింది. ఆ బిడ్డను చేతుల్లోకి తీసుకుని చుట్టూ చూశాడు. కదిలిపోతున్న కారును, కారునెంబరు చూసి ఆ పురిటి కందును అచ్చట వదిలి వెళ్ళిన వారెవ్వరో గ్రహించి ఆశ్చర్యంతో కొయ్య బారిపోయాడు. తమ కన్నబిడ్డలు కుంటి వారైనా గ్రుడ్డివారైనా ప్రేమతో పెంచి పెద్ద చేసే వారిని ఎందరినో చూశాడు గాని సముద్రపుటొడ్డుకు అర్పితం చేసి వెళ్ళే వారిని చూడటం తన జీవితంలో ఇదే ప్రథమం.

ఆ బిడ్డ తనకు సరస్వతీ ప్రసాదంగా భావించి స్వీకరించాడు. పెంచి పెద్ద చేశాడు. అంధుల పాఠశాలలో చేర్పించి విద్యా

బుద్ధులు నేర్పాడు. తమ సంగీత కళా ప్రపం తికి వారసురాలుగా చేశాడు. సంగీత సామ్రాజ్యానికి విజేతగా చేసి సంతోషంగా తనువు చాలించాడు.

*    *    *

ఆనాటి నుంచి ఈనాటి వరకూ కూడా ఆ బిడ్డ ఏమైందన్న ప్రశ్న ఆమె మనసులోకి రాలేదు. నాడు తాను చేసిన పాప కృత్యానికి ఫలితంగా తను జీవితంలో తండ్రిని భర్తను పోగొట్టుకుని వంటరిగా మిగిలి పోయింది.

సంగీత కచేరిలో సరస్వతిని చూసిన క్షణంనుంచి ఆమె హృదయం సంక్షోభంలో చిక్కుకుంది. కన్నుమూసినా తెరచినా ఆమె రూపమే కంటిముందు కదలాడుతోంది.

డాక్టర్ సరోజినీ మనసు నిగ్రహించుకోలేక పోయింది. కారు తీసుకుని సరస్వతి ఇంటికి బయలుదేరింది.

కాలింగ్ బజర్ శబ్దం విని నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ వెళ్ళి తలుపుతీసి "ఎవరూ?" అంది.

"నేను డాక్టర్ సరోజినిని" ఎందుకో ఆమె గొంతుతడబడింది.

"లోపలకి రండి"

పొందికగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దబడిన డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్నారు ఇద్దరూ. కంటితో చూడలేక పోయినా ఆమె అభిరుచికి అనుగుణంగా తీర్చిదిద్దబడిన ఆ గదిలోని వస్తువుల్ని చూసి సరోజినీ దేవి ముగ్ధురాలైంది.

"నిన్న నీ సంగీత కచేరి విన్నాను. అప్పటినుంచి నిన్ను చూడాలనే తపనను అణుచుకోలేక పోయాను. నువ్వు పేరుకే సరస్వతివి కాదు సంగీత సరస్వతి అపరావ తారంవలే భాసించావు. నిన్ను అభినందించలేకుండా వుండలేక పోతున్నాను."

"అందులో నా గొప్పతనం ఏమీ లేదు. నన్ను పెంచి పెద్ద చేసిన నా తండ్రి గారి కృషికి దీక్షకు ప్రతిఫలం మాత్రమే"

"నీ వలన ఆయన జన్మ ధన్యమైంది"

## చిట్కా వైద్యం



వ్యాధి ముదరటానికి ముందు చిట్కా వైద్యాన్ని ఆశ్రయిస్తే కొన్ని సందర్భాలలో పూర్తిగా వ్యాధిని నివారించవచ్చు. మధుమేహ వ్యాధితో బాధపడేవారు ప్రతిరోజూ రాత్రి పడుకోబోయే ముందు అయిదారు ఎండిన వేప ఆకుల్ని కొద్దిగా బెల్లంతో కలిపి నూరి, ఉప్పు, సొంఠిలను కొద్దికొద్దిగా కలిపి పాలతో తాగాలి. కొన్నాళ్ళకు ఈ వ్యాధి మటుమాయమవుతుంది. అలాగే ఎండిన వేప ఆకులు, ధనియాలు, మిరియాలు, ఉప్పు కలిపి నూరి, ఉదయం రాత్రి ఆహారంతో తీసికొంటే అజీర్ణం తగ్గిపోతుంది. ప్రయత్నించి చూడండి మరి!

జూపిటర్

''అలా అనకండి. ఆయన దయవలనే నా జీవితం సార్థకమైంది.

''అవును ఇప్పుడు జాత్యంధులకు కూడా కళ్ళు అమర్చి చూపు తెస్తున్నారు కదా. నువ్వు ఎందుకు ప్రయత్నించటం లేదు. నేను కంటి డాక్టర్‌ను. అమెరికాలో చదివి పెద్ద డిగ్రీలు తీసుకున్నాను. నా చేతుల మీదుగా అనేక మందికి చూపు వచ్చింది. నీకు అభ్యంతరం లేకపోతే నేను నీకు ఆపరేషన్ చేసి దృష్టి వచ్చేలా చేస్తాను. ఈ ప్రపంచపు అందచందాలను నీ కంటితో చూడగలుగుతావు.''

''నో.. డాక్టర్ నాకు ఆపరేషన్ ఇష్టంలేదు. నేను అంధత్వాన్ని జయించగలిగాను. నా మనో నేత్రంతో సర్వం జూడగలుగుతున్నాను. అంధత్వం ఆటంకం కాదని అంధులు కూడా రెండు కళ్ళూ వున్న వారికంటే కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ప్రపంచానికి రుజువుచేయటమే నా లక్ష్యం'' అంది సరస్వతి. ఆమె గొంతులోని ఆవేశాన్ని తీవ్రతను చూసి డాక్టర్ సరోజినిదేవి ఖిన్నురాలైంది. ఆమె మాటలు ఎవరిమీదో ద్వేషంతో పంతంతో ఉన్నట్టు ఎవరికో కనువిప్పు కలుగజేయాలనే పట్టుదలతో ఉన్నట్లు బోధపడుతోంది. ఆ ద్వేషం ఆ పంతం ఎవరిమీదో ఆమెకు తెలుసు. సరోజినీదేవి హృదయానికి మరింత గాయమైంది.

''డాక్టర్ నామీద దయతో ఇంతదూరం వచ్చినందుకు కృతజ్ఞతలు. నావంటి అభాగ్యులు ఈ లోకంలో అనేకమంది ఉన్నారు. మీ దయవాళ్లమీద చూపండి నేను సంతోషిస్తాను''

''నేను వెళ్లి వస్తాను. నీ మనసు మార్చుకుని ఎప్పుడయినా ఆపరేషన్ చేయించదలుచుకుంటే ఆ అవకాశాన్ని, అదృష్టాన్ని నాకు కలుగజేయి తల్లీ''

ఆమెకు తెలియకుండా ఆమెలోని మాతృహృదయం ఉప్పొంగి హృదయమంతా వ్యధతో నిండిపోయింది.

* * *

''అమ్మా పట్టెడు అన్నంపెట్టు తల్లీ'' ఎవరో బిచ్చగత్తె గేటు బయటనుంచి అరుస్తోంది.

సరస్వతి తనకోసం డైనింగ్ టేబిల్‌మీద వంటమనిషి సర్దివెళ్ళిన పాత్రల్ని చేతిలోకి తీసుకుంది.

''గేటు తెరుచుకుని లోపలికిరా!''

ఆ బిచ్చగత్తె పాత్రల లోని పదార్థాలను అందుకుని అక్కడే ఆత్రంగా తినసాగింది.

''నీ పేరేమిటి?'' సరస్వతి అడిగింది.

''లక్ష్మి''

సరస్వతికి నవ్వు వచ్చింది, లక్ష్మి అడుక్కొని తింటోంది.

''నీకు పద్దెనిమిదేళ్ళు వుంటాయికదూ!''

''అవునమ్మా అంత కరక్టుగా ఎలా చెప్పావు''

''నీ కంఠస్వరాన్ని బట్టి''

లక్ష్మి తినడం ఆపి ఆమె కళ్లల్లోకి చూసింది అన్నీ ఇచ్చిన ఆ భగవంతుడు ఈ అమ్మకు కళ్ళెందుకు ఇవ్వలేదో తనలో తాను

అనుకుంది.

"నువ్వు చదువుకున్నావా?"

"ఎనిమిదో తరగతి చదువుకున్నానమ్మా. అంతలోనే మా అయ్య చచ్చిపోయాడు, అప్పటినుండీ నా పాట్లు మొదలయ్యాయి.... చాలచోట్ల పనికి కుదిరాను, ప్రతిచోటా నామీద దొంగతనం అంటగట్టడమో చా టుమాటుగా నా చేయిపట్టుకోవడమో జరుగుతోంది. ఇక లాభంలేదని ఇందులో దిగాను. ఇదికూడా సుఖంగాలేదు. నా వయసు నా అందం నాకు శత్రువులయ్యాయి"

సరస్వతి ఆమె స్థితికి జాలిపడింది. "మా ఇంట్లో వుండి నా పనులన్నీ చేస్తూ నాకు సహాయంగా వుండిపో"

"వద్దులేతల్లీ నాకథ మళ్లీ మొదటికే వస్తుంది. నీకు దయకలిగితే వచ్చినప్పుడల్లా పిడికెడు అన్నం పెట్టు."

"ప్రతిరాత్రి ఈవేళకు వస్తే అన్నం పెడతాను"

"తల్లీ ఒకమాట అడుగుతాను ఏమీ అనుకోవుకదా?"

"సందేహం ఎందుకు అడుగు"


"చచ్చిపోయినవాళ్ళ కళ్ళు అతికించి కంటిచూపు వచ్చేలా చేస్తున్నారు కదా. ఇంతడబ్బు ఉండికూడా నువ్వు ఆపరేషన్ ఎందుకు చేయించుకోవు.

ఆ మాటకు సరస్వతి ముఖంలో అనేక మార్పులు వచ్చాయి.

"ఈ కంటితో ఏం చూడాలి, ఎవ ఎవరున్నారని చూడాలి, ఈ సమాజంలోని మనుషుల హృదయాల నిండుగా అంధకారమే. కళ్లున్న గుడ్డివాళ్లు. నేను అంధురాలిగానే ఉంటాను. జీవితాన్నంతా అంధత్వపు అంధకారంతోనే గడుపుతాను"

మారిన ముఖంలోని రంగుల్ని ఆమె మాటల్లోని తీవ్రతను చూసి లక్ష్మి చలించిపోయింది. "తప్పయితే క్షమించుతల్లీ, నీ మనసు కష్టపెట్టాను" అంది.

లక్ష్మి తినడం పూర్తిచేసి "ఇక వెళ్లి వ



స్తానమ్మా!'' అని బయలుదేరింది.

"లక్ష్మీ! ఇటు రా ఒక్కమాట'' లక్ష్మి వెనక్కి వచ్చింది.

"నా గురించి నీ కెందుకే అంత ఆసక్తి''

లక్ష్మి ఒక్క నిముషం తటపటాయించి ''ఆపరేషన్ చేయించుకుంటే నా కళ్ళు నీకు ఇస్తాను తల్లీ! నీలాంటి చక్కని అమ్మకు, కళ్ళు లేకపోవడం చూసి నాకు బాధగా వుంది. నా వంటి బిచ్చగత్తెకు కళ్ళు వుండడం కంటే లేకుంటేనే మేలు.''

సరస్వతి ఆమెలోని మానవత్వానికి చలించి పోయింది. లక్ష్మి తనకేమౌతుందని గొప్ప త్యాగం చేయడానికి సంసిద్ధతను వ్యక్తంచేస్తున్నది, పట్టెడు అన్నం పెట్టినందుకేనా. అది ఎంతమాత్రం కాదు, అది స్త్రీ జాతిలో దాగివున్న ఔన్నత్యానికి దయాగుణానికి పరాకాష్ట.

''లక్ష్మీ బతికివున్న వారికళ్ళు తీస్తే నేరం తెలుసా''

''అలాగే తల్లీ!'' నిరాశగా నిట్టూర్చింది లక్ష్మి.

* * * *

రెండురోజుల నుంచి రావడంలేదు. ఆమెకోసం దాచిపెట్టిన భోజనం వెక్కిరిస్తున్నట్లు అలాగే వుండిపోయింది. లక్ష్మి పరిచయమైన ఆరునెలల నుండి, బిచ్చగత్తెగాకాక, ఒక ఆత్మీయురాలిగా మారిపోయింది. తన కళ్ళతో ఈ లోకాన్నిచూపి ఈ లోకపు తీరును తనకు బోధపరుస్తోంది.

లక్ష్మికి ఏదో జరిగింది. ఏం జరిగింది? ఎక్కడుంది? ఎక్కడుందని తను వెదకగలదు. ఆమె రూపమే తనకు తెలియదు. ఆమె వియోగంతో సరస్వతి గళం విప్పలేకపోయింది. అంగీకరించిన ప్రోగ్రామ్స్ కూడా కాన్సిల్ చేసుకుంది. ఆ రాత్రంతా సరస్వతికి నిద్రపట్టలేదు. మనస్సంతా లక్ష్మి ఆలోచనలతో నిండిపోయింది.

తెల్లవారేసరికి కాలింగ్ బజర్ అదేపనిగా శబ్దం చేస్తోంది. సరస్వతి వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా ఎప్పుడూ వినని బూట్ల చప్పుడు.

''ఎవరూ?''

''నేను పోలీస్ కానిస్టేబుల్ నమ్మా!''

''నాతో ఏం పని మీకు''

''లక్ష్మి అనే అమ్మాయి మీకు తెలుసా?''

''తెలుసు''

''లక్ష్మి రెండు రోజుల క్రిందట లారీ క్రిందపడింది. తలకు బలమైన గాయం తగిలి రెండురోజుల నుండి స్పృహలేదు. నిన్న స్పృహరాగానే మీపేరే కలవరించింది. మరణవాఙ్మూలంలో తన రెండుకళ్ళను మీకు దానం చేస్తున్నట్టు చెప్పింది. ఆ కళ్ళను తీసి డాక్టర్ సరోజినీదేవి హాస్పటల్‌లో భద్రపరిచారు. ఈ వార్త మీకు అందజేయవలసిందిగా కోరుతూ కన్నుమూసింది''

సరస్వతి ఆ మాట వింటూనే షాక్ తగిలిన దానిలాగే చలించిపోయింది. కానిస్టేబుల్ తన డ్యూటీ అయిపోయినట్లు భావించి తిరిగి వెళ్ళబోయాడు.

''ఆమె శవం ఎక్కడ ఉన్నది''

"పోస్టు మార్టం పూర్తయిన తరువాత నిన్ననే బరియల్ గ్రౌండుకు తీసుకెళ్ళిపోయారమ్మా. అన్నీ పూర్తయిపోయాయి"

కానిస్టేబుల్ వెళ్ళిపోయాడు. సరస్వతి తిరిగివచ్చి గుమ్మంలోనే కూలబడిపోయింది. మనసు వికలమై పోయింది. "ఎంత పనిచేసావు లక్ష్మీ! నీ కళ్ళు నాకు అందించాలనే కోరికతోనే ఇలా చేసావా?" అనుకుంది. ఈలోకాన్ని కళ్ళతో చూడకూడదన్న దృఢ నిశ్చయం గాలికెగిరి పోయింది. ఒక స్నేహమయి, త్యాగం, బలిదానం వృధా కాకూడదు. ఆమె కోసమైనా తను ఈ లోకాన్ని ఆమె కళ్ళతో చూడకతప్పదు.

ఈ ప్రపంచంలో ఎవరు ఎప్పుడు కలుస్తారో ఎవరికి ఎవరు ఏమౌతారో తెలియదు. ఒకరికోసం మరొకరు ప్రాణాలనే అర్పించడమనేది చాల అరుదైన విషయం.

* * *

ఆపరేషన్ పూర్తయిన తరువాత ఆరోజు సరస్వతి కళ్ళకు కట్టిన కట్లు విప్పబోతున్నారు. డాక్టర్ సరోజినీదేవి ఇద్దరు సిస్టర్సు సరస్వతి వున్న గదిలోకి వచ్చారు. కట్లు విప్పిన తరువాత నెమ్మదినెమ్మదిగా కళ్ళు ఎలా విప్పి చూడాలో సరస్వతికి అర్థమయ్యేలా బోధపరిచారు ఆమె వారి మాటను విని మౌనంగా ఉండిపోయింది.

"అంతా పూర్తయిన తరువాత నెమ్మదిగా కళ్ళు విప్పిచూడమ్మా" అంది సరోజినీదేవి.

"డాక్టర్ దయచేసి మీరంతా బయటకెళ్ళిపోండి. మొదటిసారిగా నేను చూడదలుచుకున్నది మీలో ఎవరిముఖము కాదు. నాకు మీరు అమర్చిన నా స్నేహితురాలి కళ్ళను మాత్రమే. నాకు దృష్టి వచ్చిందో లేదోనని మీరు సందేహించనవసరం లేదు. ఈ ప్రయత్నం నెనక ఒక పుణ్య స్త్రీ యొక్క ఆత్మ ఆవహించియున్నది, ఆమె ప్రయత్నం అర్తి వృధాకాదు. మీరుచేసిన ఆపరేషన్ విజయవంతమౌతుంది. అందుకు భిన్నంగా జరగదని నేను మీకు హామీ ఇస్తున్నాను"

హాస్పటల్‌లో చేరిన క్షణం నుంచి ఆమె

## పేపర్



పొద్దున్నే యింటింటికి వెళ్ళి పేపర్లు వేస్తున్న గణేశ్‌ని ఆపాడు కుటుంబరావు.

"ఏదీ ఆ పేపరిలా యివ్వు" అడిగాడు కుటుంబరావు.

"డెబ్బయి పైసలివ్వండి" పేపరిస్తూ అడిగాడు గణేశ్.

"భలే వాడివయ్యా... డబ్బు లెందుకు పది నిముషాలాగు. పేపరేయిచ్చేస్తాను" తాపీగా అన్నాడు కుటుంబరావు.

—కదలి వెంకటేశ్వరరావు (అమలాపురం)

ప్రవర్తనను గమనిస్తున్న వారికి ఆశ్చర్యం కలుగలేదు. అంతా ఆ గదినుంచి నిష్క్రమించారు. అంతా వెళ్ళిపోయారని నిశ్చయానికి వచ్చాక తలగడ క్రింద దాచుకున్న అద్దాన్ని బయటకుతీసి క్రమంగా కనురెప్పలు విప్పింది. ముందు అస్పష్టంగా తరువాత స్పష్టంగా రెండు కళ్ళు అద్దంలో సాక్షాత్కరించాయి. లక్ష్మి ఏ కోరిక నెరవేరిందా అనుకుంది.

మరువాడు .డాక్టర్ సరోజినీదేవి హాస్పటల్‌కు వచ్చేసరికి డ్యూటీలో వున్న సిస్టర్ "సరస్వతి వెళ్ళిపోయిందమ్మా" అని చెప్పింది. ఆమె మాటలు విని నిశ్చేష్టురాలైంది. ఆమె చేతిలోని బుకే జారిపోయింది.

"ఎలా వెళ్ళనిచ్చావు"

"ఎంత చెప్పినా విన్నది కాదు. ఆ అమ్మాయి పెంకెతనం మీకు తెలుసుకదా. మన బిల్లు పూర్తిగా చెల్లించి వెళ్ళిపోయింది."

"నాకు చెప్పమని ఒక్కమాటకూడా చెప్పలేదా?"

"మీకు ఇవ్వమని ఒక కవరు ఇచ్చి వెళ్ళింది"

డాక్టర్ సరోజినీదేవి ఆ కవరు విప్పి ఆత్రంగా చదివింది.

"డాక్టర్!

నా జీవితంలో ఇద్దరే ఇద్దరు స్త్రీలు చెరగని ముద్రవేసారు. అందులో మొదటి స్త్రీ నన్ను నవమాసాలు మోసిన కన్నతల్లి. ఆమె నేను అంధురాలిననే కారణం వలన తను తిరిగే హై సొసైటీలో ఎక్కడ తక్కువగా చూడబడతాననో గుడ్డిదాని తల్లిగా పిలవబడతాననో, అందరి సానుభూతి తన అహాన్ని దెబ్బతీస్తుందని, సముద్రపుటొడ్డున వదిలివెళ్ళి పోయింది.

ఇక రెండవ స్త్రీ తనకు ఏ రక్త బంధమూలేక పోయినా స్త్రీ జాతిలో దాగివున్న మహత్తరమైన దయాగుణం వలన తన కళ్ళను నాకు సమర్పించాలనే సంకల్పంతో తనకుతాను సమర్పించుకుంది. ఆమె కళ్ళు నాలో ఉన్నంతవరకూ ఆమె ఆత్మనన్ను ఆవహించుకుని ఉంటుంది.

ఏ కన్నతల్లి నన్ను, నా ముఖాన్ని చూడకూడదని నన్ను త్యజించిందో. ఆ కన్నతల్లినే నేను శాశ్వతంగా త్యజిస్తున్నాను.

మొదటి స్త్రీ నా కన్నతల్లిని నీవేనని నాకు తెలుసు. నీకు అక్కరలేదనుకున్న బిడ్డను తిరిగి కలుసుకోవడానికి ప్రయత్నించకు, అలా ప్రయత్నిస్తే ఆమె శవమే నీకు లభిస్తుంది.

ఇట్లు సరస్వతి

డాక్టర్ సరోజిని ఉత్తరం చదవడం పూర్తిచేసి కుర్చీలో కూలబడిపోయింది. సరస్వతి తన గుండెలమీద తన్ని వెళ్ళిపోయింది. తనకు తగిన శిక్ష విధించి శాశ్వతంగా కన్నీటితో బ్రతకమని శాసించి వెళ్ళిపోయింది.

డాక్టర్ సరోజినీదేవి ఆ ఉత్తరాన్ని గుండెలకు హత్తుకుని అలాగే ఉండిపోయింది.